## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల



ముస్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ముస్సిపల్ కార్మికులు

కొడంగల్, మే 8: ఈ నెల 20 న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలని, కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలన్నారు. కార్మికులు మరణిస్తే రూ.30వేలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌కు అందజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పకీరప్ప, ఉపాధ్యక్షుడు మొగులప్ప, కార్యదర్శి రమేశ్, సహాయ కార్యదర్శి మహేశ్, వెంకటలక్ష్మి, సుగుణమ్మ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



కులకచర్ల, మే 8: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు చాలా ఉపయోగపడుతుందని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు తెలిపారు. గురువారం మండల పరిధి లోని లాల్‌సింగ్ తండాలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన చందర్‌నాయక్‌కు రూ.34000, జీతుల తండాకు చెందిన నీల్యానాయక్‌కు 7500లు, ఎర్రగోవింద్‌తండాకు చెందిన సునీతా జయరాంకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్‌నాయక్, విష్ణునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాచీన కళలను బతికించడం అభినందనీయం



నవాబుపేట, మే 8: టెక్నాలజీ సహకారంతో అభివృద్ధి చెందిన నేటి సమాజంలోనూ ప్రాచీన కళలను బతికించడం గొప్ప విశేషమని మండల పరిధిలోని అక్నాపూర్ గ్రామస్తులను చుట్టుపక్కల గ్రామస్తులు అభినందించారు. రెండు రోజులుగా వీరభద్ర విజయం (దక్ష యజ్ఞం) యక్షగానాన్ని ప్రదర్శించి ప్రాచీన కళల పట్ల ఉన్న మక్కువను చూపించారు అక్నాపూర్ వాసులు. నెల రోజులుగా సాధన చేసి వివిధ పాత్రలు వేసి గ్రామస్తుల మన్ననలు పొందారు. ఈ ప్రదర్శనలో గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి



బంట్వారం, మే 8: బంట్వారం మండల పరిధిలోని రొంపల్లి గ్రామంలో కోట నాగమణి, హరిహరల ఆధ్వర్యంలో పోచమ్మ దేవాలయం నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తిభావాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని, దీంతో మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు. ఆలయ నిర్మాణం చేపట్టిన కుటుంబ సభ్యులు కోట సంగమేశ్వర్, కోట సంధ్యారాణిలను అభినందించారు.

## మానవ అక్రమ రవాణాను అరికడదాం




ధారూరు మే 8: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం వికారాబాద్ జిల్లా హెడ్ కానిస్టేబుల్ అలీముద్దీన్ అన్నారు. గురువారం ఎస్పీ కె.నారాయణ రెడ్డి ఆదేశానుసారం సత్యసాయి గ్రామీణ సార్వజనిక కేంద్రం కెరెళ్లిలో జరుగుతున్న బాలవికాస్ వేసవి శిబిరాన్ని సందర్శించి పిల్లలకు మహిళలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఏదైనా తినడానికి ఇస్తే అప్రమత్తంగా ఉండాలని అలాగే అపరిచిత వ్యక్తులు అనుమానంగా సంచరిస్తూ ఉంటే డయల్ 100 కు కాల్ చేయాలని వెంటనే పోలీసులు స్పందిస్తారని వారికి తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ రవీందర్ శ్రీ సత్యసాయి సేవా సమితి కేరెళ్లి సభ్యులు రాజేందర్ రెడ్డి, నరసింహులు సాయి బాలవికాస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై దాడి..ఇద్దరి అరెస్ట్

హిమాయత్‌నగర్,మే 8: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని కడప జిల్లాకు చెందిన సంగటి నాగేశ్వర్ రెడ్డి(56), నెల్లూరు జిల్లాకు చెందిన సి.ప్రభావతి(61)లు హిమాయత్‌నగర్‌లో ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న డీఎస్సై వెంకటేశ్, ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై కరుణాకర్ రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి వ్యభిచార గృహంపై దాడి చేశారు. ఇద్దరు విటులతో పాటు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.
నిర్వాహకుల నుంచి రూ.3 వేలు నగదుతో పాటు 6 కండోమ్ ప్యాకెట్లు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు నాగేశ్వర్ రెడ్డిపై 2004లో చిక్కడపల్లి, 2008లో పంజాగుట్ట, 2012లో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లలో వ్యభిచార నేరంలో అరెస్టు అయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..రైతులకు శాపం

■ రోడ్డు వెడల్పు పనుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన వైనం ■ విద్యుత్ సరఫరాకు అంతరాయం



రోడ్డు వెడల్పుతో ట్రాన్స్‌ఫార్మర్‌పై మట్టి పోసిన దృశ్యం

పూడూరు, మే 8: రోడ్డు వెడల్పులో భాగంగా కాంట్రాక్టర్ రోడ్డు ఇరు వైపులా రెండు మీటర్ల ఎత్తుపై మట్టిపోసి లేపారు. పూడూరు మండల పరిధిలోని కంకల్ నుంచి లాల్‌పహాడ్ చౌరస్తా వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తీర్ణ పనులు చేపట్టారు. తుర్కెన్కెపల్లి గ్రామ పరిధిలో రైతుల పొలాలకు సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ రోడ్డు పక్కనే ఉంది. రోడ్డు వెడల్పు పనులను అధికారులు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. గత ఆరు నెలల నుంచి రోడ్డు విస్తీర్ణ పనులు సాగుతున్నాయి. అయితే రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను స్థలమార్పిడి చేయకుండా కాంట్రాక్టర్ మట్టిని అలాగే వేశారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై మట్టిపడి విద్యుత్ ఫీజులు ఎగిరిపోయి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సుమారు 10మంది రైతుల బోరు బావులకు విద్యుత్ సరఫరా అవుతుంది. పెద్ద ఉమ్మెంతాల్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఈ ప్రాంతానికి సరఫరా అవుతుంది. గత నెల రోజుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోట ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని మండల విద్యుత్ ఏఈకి, సబ్‌స్టేషన్ లైన్‌మెన్‌ను కోరుతున్న స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమస్యతో జొన్న, వరి, కూరగాయ పంటల సాగురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై పోసిన మట్టిని తామే తొలగించం గానీ అధికారులు పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పూడూరు మండల కేంద్రంలో పీర్ల మసీదు వద్ద ఉన్న ఇండ్లపై నుంచే విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదకరంగా ఉందని స్తంభాలను మార్చాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

**చెప్పినా పట్టించుకోవడంలేదు..**



ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డు పక్క నుంచి మరో చోటుకు మార్చే వరకు ఆ ప్రాంతంలో మట్టి పొయ్యొద్దని కోరాం. రైతులకు ఇబ్బంది కలిగించేలా కాంట్రాక్టర్ ఇష్టానుసరంగా వ్యవహరించాడు. విద్యుత్ అధికారులకు ముందుగానే తెలిపినా పట్టించుకోలేదు.ప్రస్తుతం విద్యుత్ సమస్యతో పంట సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నాం. ప్రస్తుతం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరో చోట మార్చ లంటే దిమ్మె నిర్మాణానికి నిధులు మంజూరు కావాలని అధికారులు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్, విద్యుత్ అధికారుల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నాయకులు, అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చి సమస్యను పరిష్కరించాలి

-రాజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తుర్కెన్కెపల్లి , పూడూరు

# చెరువులోకి దూసుకెళుతున్న వాహనాలు

•గతంలో కూడా ఓ కారు పడి.. ఒకరు మృతి • రోడ్డు వెడల్పు చేసి రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలంటున్న వాహన దారులు



గురువారం చెరువులోకి దూసుకు పోయిన కారు

వికారాబాద్, మే 8: ప్రతి రోజూ వందల సంఖ్యలో వాహనాలు వికారాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళుతుంటాయి. శివసాగర్ చెరువుకు అతి సమీపంలో రోడ్డు వెడల్పు లేక పోవడంతో పాటు, రక్షణ వలయాలు (కాంక్రిట్ కంపౌండ్ వాల్ ) లేక పోవడంతో అదుపు తప్పి వాహనాలు చెరువులోకి దూసుకెళ్తున్నాయి. గురువారం వికారాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ కారు టైర్ పగిలి అదుపు తప్పి శివసాగర్ చెరువులోకి దూసుకపోయింది. పెద్ద ప్రమాదం జరుగక పోవడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయట పడ్డారు. నెల రోజుల క్రితం ఓ ఆటో కూరగాయలను తీసుకొని మన్నెగూడ వస్తుండగా టైర్ పగిలి శివసాగర్ చెరువు సమీపంలో నిలిచిపోయింది. గతంలో 2023 డిసెంబర్ 25న తెల్లవారు జామున హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఓ కారు శివసాగర్ చెరువులోకి దూసుకపోయి నీట మునిగింది. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఐదుగురు పర్యాటకులు తెల్లవారు జామున ఏపీ 37ఏటీ5000 నెంబర్ గల కారులో వికారాబాద్ అనంతగిరి హిల్స్‌కు వస్తున్నారు. వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేట చెరువు వద్ద అదుపుతప్పి ఉదయం ఐదు గంటల సమయంలో కారు చెరువులోకి దూసుకపోయింది. గమనించిన స్థానికులు 100 డయల్, 108కు సమాచారం అందజేశారు. కారు నీటిలో మునిగి పోవడంతో నలుగురు బయటపడగా వారిని పట్టణంలోని ఓ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గుణశేఖర్ అనే యువకుడు చెరువులో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో చెరువులో పడ్డ కారును బయటకు తీశారు. గజ ఈత గాళ్లతో గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెరువు పరిసరాలను పరిశీలించారు. సహాయ చర్యలు వేగవంతం చేయాలని పోలీసులకు సూచించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం వికారాబాద్ సిఐ ఆధ్వర్యంలో రిస్క్యూ టీంతో ప్రత్యేక బృందాలతో గాలిపు చర్యలు చేపట్టగా 11 గంటలు తరువాత గుణశేఖర్ మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాద కరం గా మారిన రోడ్డును వెడల్పు చేసి, కాంక్రీట్ కాంపౌండ్ వాల్‌ను ఏర్పా టు చేసి ఉంటే ప్రమాదాలకు ఆస్కారం ఉండేది కాదంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా చెరువులోకి వెళ్లకుండా కాంక్రీట్ కాంపౌండ్‌వాల్ వంటి ధృడమైన కట్టడాలు ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు.

# అధికారులు అంకితభావంతో పని చేయాలి

ధారూరు మే 8: అధికారులు అంకిత భావంతో పనిచేసి భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం ధారూరు మండల పరిధిలోని నర్సాపూర్, గడ్డమీది గంగారం గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని రైతులు ఇచ్చిన ఫిర్యాదులను తీసుకున్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసు చంద్ర, ధారూరు,కోట్‌పల్లి తహసీల్దార్లు సాజీదాబేగం, శ్రీనివాస్, ధారూరు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు. కాగా నర్సాపూర్ రెవెన్యూ సదస్సులో 12 గడ్డమీది గంగారం రెవెన్యూ సదస్సులో 24 ఫిర్యాదులు వచ్చినట్లు ధారూరు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తెలిపారు. శుక్రవారం ధర్మాపూర్, కొండాపూర్‌కలాన్ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నర్సపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



## అడ్డుగా కంపచెట్లు .. రాకపోకలకు ఇబ్బందులు

బషీరాబాద్, మే 8 : మండల పరిధిలోని మల్కన్‌గిరి గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డుకు కంప చెట్లు అడ్డుగా ఉండటంతో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీకి మరో దారిలేక అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. కంప చెట్లను తొలగించాలని అధికారులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. మనిషి నడుచుకుంటూ పోవడానికి వీలు లేకుండా కంప చెట్లు రోడ్డును ఆక్రమించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామి పని ద్వారా తొలగించాలని సంబంధిత అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించడం లేదన్నారు. మా గ్రామం కాశీంపూర్ పంచాయతీ పరిధిలో ఉండటంతోనే ఇన్ని రోజు లు మా గ్రామాన్ని పట్టించుకోలేదని వారు ఆరోపించారు. అయితే మా గ్రామాన్ని ప్రత్యేక పంచా యతీగా ప్రకటించినప్పటికీ అధికారుల నియామకం నిధుల కెటాయింపు జరగలేదన్నారు. దీంతోనే సమస్యలు తీరడం లేదన్నారు.

## రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డులు..



రైతుల వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓ శ్రీపతిరెడ్డి

కొడంగల్, మే 8 : కేంద్రప్రభుత్వం రైతులకు ఆధార్‌కార్డు మాదిరిగానే 11అంకెలతో విశిష్ట గుర్తింపు కార్డులను అందించేందుకు చేపట్టిన కార్యక్రమం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో గురువారం ప్రారంభమైంది. మొదట రుద్రారం గ్రామంలో ఏఈఓ శ్రీపతిరెడ్డి రైతుల నమోదును చేపట్టారు. వ్యవసాయ అధికారులు రైతుల పేర్లు నమోదు చేసుకుంటున్నారని త్వరలో మీ సేవలో కూడా అందుబాటులోకి వచ్చే ఆవకాశం ఉందన్నారు. ఆధార్‌కార్డుతో అనుసంధానమైన పట్టాదారు పాసుపుస్తకంలోని భూ యాజమాన్య వివరాల నమోదు ద్వారా రైతులకు గుర్తింపు కార్డులు కేటాయించనున్నారు. రైతుల కోసం కేంద్రప్రభుత్వం పీఎంకిసాన్ పంటల భీమా,మౌళిక సదుపాయాల కల్పన సహ పలుపథకాలు అమలుకు తోడ్పడనుంది. రైతుల వారీగా పంటల వివిరాలు ఇతరత్ర సమాచారం ఇందులో ఉంటుందని అయన వివరించారు. రైతులు ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.

## రుణమాఫీ చేస్తా మంటూ సైబర్ మోసం

బంజారాహిల్స్, మే 8: ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్న చేబెల్లి వెంకన్న అనే వ్యక్తి ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉన్న రుణంలో 2.40 లక్షల మేర మాఫీ చేసేందుకు ఆఫర్ వచ్చిందని రెండ్రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. అయితే రూ.56,800 ఫీజులు చెల్లిస్తే వెంటనే మాఫీ అవుతుందని నమ్మించాడు. అతడి మాటలు నమ్మిన వెంకన్న.. సంపత్‌నాని, బూక్యా నాని అనే పేర్లతో ఉన్న నంబర్లకు యూపీఐ ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత బ్యాంక్‌కు వెళ్లిన వెంకన్న ఆరా తీయగా.. తమ బ్యాంక్ తరపున ఎలాంటి రుణమాఫీ చేయలేదని, బ్యాంక్ నుంచి ఎవరూ కాల్ చేయలేదని చెప్పారు. తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## దేశ రక్షణ విషయంలో కేంద్రానికి మద్దతు



పరిగి, మే 8: దేశ రక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికైనా మద్దతు పలుకుతామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతమొందించిన భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం పరిగిలోని కొడంగల్ క్రాస్‌రోడ్డులో నిర్వహించిన ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసినందుకు సైన్యానికి సెల్యూట్ చెప్పారు. భారత దేశ పౌరులను, ఎల్లవేళలా దేశాన్ని కాపాడుతున్న సైన్యం సేవలను ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. దేశ భద్రత విషయంలో పార్టీలకతీతంగా మద్దతు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు లాల్‌కృష్ణప్రసాద్, పాలాది శ్రీనివాస్, చిన్న నర్సింహులు, విజయకుమార్‌రెడ్డి, హన్మంతు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్



బషీరాబాద్, మే 8 : మండల పరిధిలోని కాశీంపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ తూకం చేసిన వెంటనే రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు జరుపాలన్నారు. కేంద్రానికి వచ్చే రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తూకం వేసేటప్పుడు రైతులను మోసం చేయకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



కులకచర్ల, మే 8 : రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కుస్మసముద్రం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదన్నారు. రైతులు దళారుల దగ్గరకు వెళ్లకుండా నేరుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించాలన్నారు. వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మహేశ్, బాబు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలి



బొంరాస్‌పేట్, మే 8 : వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మండల పరిధిలోని కొత్తూర్ గ్రామంలోని ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లా వ్యాప్తంగా 128 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు పం పించాలని సెంటర్ నిర్వాహకులకు సూచించారు. రైతుల నుంచి జిల్లా వ్యాప్తంగా 12వేల 275 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లులకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎస్‌వో మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులను రాజీ చేసుకోండి

తాండూరు, మే 8: పెండింగ్‌లో ఉన్న చెక్ బౌన్స్ కేసులను రాజీ చేసుకోవాలని, దీనివల్ల సమయం, డబ్బు రెండూ వృథా కావని తాండూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శివలీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు జూన్ 9 నుంచి 14 వరకు స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకావాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962